# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డీజిటల్ పత్రిక

శనివారం 23.05.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి (కె.ఆర్)


## తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ పదవికి
## ఆకునూరి మురళి రాజీనామా



9లో..

## నిమ్స్‌లో 2000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్

### వైద్య బృందానికి సీఎం రేవంత్ అభినందనలు






**హైదరాబాద్, మే 22:** కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిడ్నీ మార్పిడి చికిత్సలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తి చేసింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది. ఈ అరుదైన మైలురా యిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందిం చిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95% మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడిలు చేసి నిమ్స్ రికార్డు నెలకొల్పింది.

# రేవంత్.. దమ్ముంటే రాజీనామా చేయ్



వివరాలు 7లో

## కేటీఆర్ సవాల్

- మేము రాజీనామా చేస్తం.. మీరూ చేయండి
- రేవంత్ ముఖం చూసి ఓటర్లు ఓట్లేయలే
- రేవంత్ సీఎం కావాలని ఎవరూ కోరుకోలే
- పేమెంట్, మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కొన్నవ్
- నువ్వు శక్తిమంతుడివైతే మహబూబ్‌నగర్ ఎంపీ సీటును ఎందుకు గెలిపించుకోలే?
- నువ్వు ప్రజానాయకుడివైతే ఎంపీగా ఉన్నప్పుడు ఒక్క ఎమ్మెల్యేనైనా ఎందుకు గెలిపించుకోలే?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

## భారత్ ఎన్నటికీ తలవంచదు

### అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతాం : అమిత్‌షా

**న్యూఢిల్లీ:** సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాది లోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం నాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్డర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు. బీఎస్ఎఫ్ నేరుగా రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, విలేజ్ పట్వారీల సమన్వయంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలని, అక్రమ చొరబాటుదారులను, పశువుల అక్రమ రవాణా మార్గాలను గురించాలని అమిత్‌షా సూచించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలను కలుపుకుని కలుపుతూ సెక్యూరిటీ గ్రిడ్ ఏర్పాటు జరుగుతుందని, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం శాఖ త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. దేశ భద్రతకు బీఎస్ఎఫ్ అందిస్తున్న సేలను అమిత్‌షా ప్రశంసించారు. 1965లో బీఎస్ ఎఫ్‌ను కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభించగా ఇప్పుడది 2,70,000 మందితో పటిష్టమైన దళంగా ఏర్పడిందని, ప్రపంచం లోనే అతిపెద్ద సరిహద్దు రక్షణ దళంగా నిలి చిందని



అన్నారు. సరిహద్దుల పటిష్టత విష యంలో బీఎస్ఎఫ్ ఎప్పుడూ వెనుకంజ వేయలేదన్నారు.

## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

### దేశవ్యాప్తంగా సరికొత్త చర్చ

**న్యూఢిల్లీ, మే 22:** దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?' అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో



పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. రాబోయే రోజుల్లో క్రీమీలేయర్ నిబంధనలపై కోర్టు ఇచ్చే తీర్పు రిజర్వేషన్ల చట్టాల్లో మరిన్ని సంస్కరణలకు దారితీసే అవకాశం కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జూన్‌లో రాజ్యసభ ఎన్నికలు

### సీఈసీ నోటిఫికేషన్ విడుదల



**హైదరాబాద్** : దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఖాళీ కానున్న 24 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 4 స్థానాలతో పాటు గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు ఓట్లు లెక్కిస్తారు. జూన్1న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలకు జూన్ 8 చివరి తేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీల ఉంటుంది. అలాగే నామినేషన్ల విత్ డ్రాకు జూన్ 11 వరకు గడువిచ్చారు. అదేరోజు ఓట్ల లెక్కిస్తారు. జూన్ 20న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. కాగా, ఏపీ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్ ల పదవీ కాలం జూన్ జూర్ 26న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

# రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు

### వరిలో యూరియా వాడకం తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చు



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం మల్యాల గ్రామంలో రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ దుర్గరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తు సాగు ఖర్చులను తగ్గించి అధిక ఫల సాయంతో మంచి ఆదాయాన్ని పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ లు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ డాక్టర్ జె సురేష్ డాక్టర్ మం శ్రీజ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....పంటల సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. విచక్షణారహితంగా ఎరువులను, రసాయన ఎరువులను పురుగుమందులను వాడవద్దని తద్వారా నేల, నీరుకలుషితమవుతుందని సూచించారు. సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పొందవచ్చని సూచించారు. వరి పంటతో పాటు ఇతర పంటలైన చిరుధాన్యాలు జొన్న, సజ్జ,పప్పు ధాన్యాలు అయిన మినుము పెసర నూనే గింజల పంటలైన పొద్దుతిరుగుడు, వేరుశనగ,నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె శారద, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బి అనిల్, పి శ్రీధర్, అభ్యుదయ రైతులు, రైతులు పాల్గొన్నారు.

# కాటారంలో వడ్ల నిల్వ గోడౌన్ల పరిశీలన

### కొనుగోళ్ల వేగవంతానికి అధికారుల చర్యలు



వాస్తవం : కాటారం

కాటారం మండలంలో ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న వడ్ల నిల్వకు గోడౌన్లు సరిపడా లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కాటారం ఆర్డీఓ రవీందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కలిసి మండలంలోని శ్రీ రుద్రా జిన్నింగ్ మిల్, మీనాక్షి కాటన్ అగ్రో ఇండస్ట్రీస్ గోడౌన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్ల సామర్థ్యం, వడ్ల నిల్వకు ఉన్న సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై అధికారులు వివరాలు తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే తూకాలు వేయాలని సూచించారు. కొనుగోలు చేసిన వడ్ల నిల్వకు తగిన గోడౌన్లు గుర్తిస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అలాగే లారీల కొరత లేకుండా తగిన వాహనాలను సిద్ధంగా ఉంచాలని పీఏసీఎస్ సెంటర్ ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, పీఏసీఎస్ సతీష్, జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వాస్తవం : చందుర్తి

చందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994 – 95వ సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 31 సంవత్సరాల పూర్వ విద్యార్థులు చందుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆనందోత్సాహాలతో అందరు కలిసి గత అనుభవాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ...అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమ దైనంది కార్యక్రమాల్లో బిజీగా ఉన్నప్పటికీ సుదూర ప్రాంతాల నుండి కార్యక్రమానికి తరలివచ్చి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. డాన్స్ చేస్తూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత హాజరైన ఉపాధ్యాయులకు, పూర్వ విద్యార్థులకు జ్ఞాపిక అందించి శాలువాలతో ప్రతి ఒక్కరిని సత్కరించారు.

# విద్యుత్ స్తంభంపై తాటి మట్ట తొలగింపు

### వాస్తవం వార్త ఎఫెక్ట్



వాస్తవం : మద్దూరు

మద్దూరు మండలం లద్నూర్ గ్రామంలో వారం రోజుల క్రితం ఈదురు గాలులకు తాటి చెట్టు నుంచి ఊడి విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న తాటి మట్టను విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. విద్యుత్ తీగలకు ఆనుకొని తాటి మట్ట వేలాడుతూ ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వార్త రావడంతో అప్రమత్తమైన విద్యుత్ శాఖ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకొని స్తంభం ఎక్కి తాటి మట్టను తొలగించారు. వాస్తవం వార్త ఎఫెక్ట్‌తో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో పెను ప్రమాదం తప్పిందని, చిన్నారులు, స్థానికులు ప్రాణభయం నుంచి బయటపడ్డామని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.

# మతం కాదు మానవత్వమే ముఖ్యం



వాస్తవం : మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని మద్దూరు గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు కాంగ్రెస్ మైనార్టీ యూత్ నాయకుడు ఎండి మౌలానా మజ్జిగ ప్యాకెట్లు అందించి మానవత్వం చాటుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం కన్నా మానవత్వమే గొప్పదని, ఎండాకాలంలో ఉపాధి కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పని సమయంలో తాగునీరు ఎక్కువగా తాగాలని, తలకు కప్పుకునే వస్త్రాలు వినియోగించాలని, జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాటం బాలయ్య, రాచకొండ సాయన్న, యూత్ నాయకుడు కిషోర్,గ్యాస్ కనకయ్య,కరీం, సంజు,కిరణ్, చింటు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి



వాస్తవం : చందుర్తి

దళిత సంఘాల ఆధ్వర్యంలో చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద శుక్రవారం సామాజిక సంఘ సంస్కర్త, కులవివక్ష, దళితులకు పాఠశాలకు స్వేచ్ఛ కల్పించిన, వైతాళికులు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నీరటి శ్రీనివాస్, బత్తుల కమలాకర్, అశ్విపత్రి యేసురత్నం, బత్తుల శ్రీనివాస్, చిలుక పెంటయ్య, బత్తుల వరయ్య, పద్మారావు, పాటి జ్యోతి, నీరటి ప్రసాద్ ,తదితరులు పాల్గొన్నారు.

# సిఐని కలిసిన కో ఆప్షన్ సభ్యుడు సుల్తానా గౌస్



వాస్తవం : బాన్సువాడ

బాన్సువాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ సుల్తానా గౌస్ ఇటీవల కో ఆప్షన్ మెంబర్గా ఎంపిక అయ్యారు. కో ఆప్షన్ సభ్యునిగా ఎంపిక కావడంతో శుక్రవారం మర్యాదపూర్వకంగా వెళ్లి సిఐ శ్రీధర్ నీ సన్మానించారు. మున్సిపల్ నూతన కో ఆప్షన్ గా ఎంపిక కావడంతో సిఐ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారం శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖతో సమన్వయంగా పనిచేస్తామని గౌస్ పేరు కొన్నారు అనంతరం సిఐ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

# విధులకు దూరం...జీతానికి దగ్గర

**ప్రజలకు సేవ లేదు... జీతం మాత్రం టైంకి**
**సంతకాలతో సరిపెట్టిన విధులు**
**విధుల పట్ల నిర్లక్ష్యం**
**ఉన్నత అధికారుల మౌనం ఎందుకు**
**నెల అంతా గైరాజార్ వేతనం మాత్రం పూర్తి**
**విధులకు హాజరు కాకుండా రిజిస్టర్లో సంతకాలు**
**దర్జాగా నెల నెల జీతం లేపుతున్న వైనం**

వాస్తవం : కామారెడ్డి ప్రతినిధి

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కేంద్రంలోని సొసైటీ సెక్రటరీ తీరు ఇతను ఎన్నో ఏళ్లుగా బీర్కూర్ సొసైటీలో పాదుకపోయి అన్ని తానై నడిపిస్తూ దర్జాగా విధులకు హాజరుకాకున్నా నెల నెల జీతం లేపుతూ రాజు నేనే మంత్రి నేనే అనే చందంలో కొనసాగుతున్నాడు. గతంలో ఇతనిపై ఎన్నో ఆరోపణలు ఉన్న ఇక్కడి నుంచి అతనిని ఎందుకు బదిలీ చేయడం లేదో తం కావడంలేదని స్థానికులు సంబంధిత అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధులకు డుమ్మా కొడుతూ జీతం మాత్రం ఫుల్లుగా లేపుతున్నాడు. సొసైటీలో ఎన్నో అక్రమాలకు పాల్పడిన సభ్యులు రైతులు అతని ప్రశ్నించిన ఏమాత్రం బెరుకు లేకుండా, ఉన్నతాధికారుల చర్యలు లేకపోవడంతో ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నాడని ఆరోపండున్నాయి. ప్రస్తుతం ప్రతి సొసైటీలో ఆన్లైన్ వ్యవస్థ కొనసాగి






స్తుండగా బీర్కూరు సొసైటీలో మాత్రం ఈ సెక్రెటరీ తీరు పట్ల రైతులు కేవలం డబ్బులు చెల్లించాలని ఆజ్ఞాపిస్తూ ఆన్లైన్ సిస్టం మా దగ్గర లేదని రైతులకు దురుసుగా చెప్పడం రైతులకు ఇబ్బందిలకు గురిచేయడం విడ్డూరం. ఏదైనా పని నిమిత్తం రైతులు పలువురు సొసైటీకి వస్తే అక్కడున్న ఇక్కడున్న అంటూ సొల్లు కబుర్లు చెబుతూ విధులకు డుమ్మా కొట్టడం ఇతనికి పరిపాటి. వాస్తవానికి ఇతను కార్యాలయానికి రాకున్నా నెలవారి మొత్తం సంతకాలు పెట్టుకున్న సంబంధిత అధికారులు చలనం లేకపోవడం బట్టి చూస్తే ఇతను ఏ విధంగా విధులకు హాజరవుతున్నాడో రైతులకు ఏమాత్రం న్యాయం చేస్తున్నాడో సొసైటీలో సభ్యులకు ఎలాంటి పనులు జరిపిస్తున్నాడు ఇట్టే అర్థమవుతుంది. సొంత పనుల నిమిత్తం కేవలం నాలుగు రోజులు సీ ఎల్ మాత్రమే పెట్టి నెలవారి సంతకాలు చేయడం పట్ల అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. పంట రుణాలు దాన్యం చెల్లింపులు సభ్యత్వ పనులు తదితర ఇతను సక్రమంగా హాజరు కాకపోవడంతో సొసైటీలో పెండింగ్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయని తెలుస్తోంది. బీర్కూర్ సోసైటీలో ఎప్పుడు సమావేశం జరిగిన గందరగోళం నెలకొంటుంది రైతులు సభ్యులు ఇతని తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని మీరుకూరు మండల వాసులు ఇతని తీరుపై మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అసలు వాస్తవాలు బహిర్గతం చేసి సెక్రటరీపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇతనిని ఇక్కడి నుంచి బదిలీపై వేరే సొసైటీకి మారిస్తే మీరు కూడా సొసైటీ బాగుపడుతుందని రైతులు సొసైటీ సభ్యులు ముక్తకంఠంతో కోరుతున్నారు. సొసైటీకి సరైన న్యాయం చేయని కార్యదర్శికి ఎందుకు విధుల్లో కొనసాగిస్తున్నారో తెలియడం లేదని, ఏండ్లుగా ఇదే సొసైటీలో పాతుకపోవడంతో ఆడిందే ఆట పాడింది పాటగా విధులు నిర్వహిస్తున్నాడని సమాచారం. ఇప్పటికైనా ఎన్నో ఏళ్లుగా పాతికపోయినా కార్యదర్శి పై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి,గతంలో ఎదుర్కొంటున్న ఆరోపణలపై, వాస్తవాలు వేల్పు తీసి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# జిల్లాలో అక్రమ మట్టి రవాణాపై పోలీసుల కొరడా

**అక్రమ మట్టి రవాణాపై 19 కేసులు నమోదు, 45 వాహనాలు సీజ్**
**అనుమతిలేని అక్రమ మట్టి తరలింపుపై ప్రత్యేక నిఘా**
**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి జిల్లాలో అక్రమ మట్టి రవాణాను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. ఈసంవత్సరం ఇప్పటివరకు అక్రమ మట్టి రవాణాకు సంబంధించి మొత్తం 19 కేసులు నమోదు చేసి, 45 వాహనాలను , 27 ట్రాక్టర్లు,11 తిప్పర్ లను, 7 జేసిబి లను సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే వెల్లడించారు.అక్రమ మట్టి రవాణాపై పోలీసుల వరుస దాడులు కొనసాగిస్తు కేసులు నమోదు చేయడం, వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మట్టి త్రవ్వకలు జరిగిన, రవాణా చేసిన కేసులు తప్పవని, జిల్లాలో ఎక్కడైనా మట్టిని తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయాలంటే ముందస్తుగా సంబంధించిన శాఖ నుండి అనుమతి పొందాలని, లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లా పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తరలించినా,తవ్వకాలు చేసినా,నిల్వ చేసినా సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.గడిచిన వారం రోజులలో జిల్లాలో అక్రమ మట్టి రవాణాపై నిర్వహించిన డ్రైవ్ వివరించారు.జిల్లాలోని తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి 3 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి 2 ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేశారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి ఒక జేసీబీ, 4 ట్రాక్టర్ లను స్వాధీనం చేసుకున్నారు.రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి 2 టిప్పర్ లను, 5 ట్రాక్టర్ లను, ఒక జేసీబీని సీజ్ చేశారు.వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేసి ఒక ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు



**నిజామాబాద్ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రమాదకర మూలమలుపులో హెచ్చరిక, సూచిక బోర్డుల ఏర్పాటు**
**చందుర్తి సర్కిల్ సిఐ కట్ల రవీందర్**

వాస్తవం : కోనరావుపేట

కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ పరిధిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో ఉన్న ప్రమాదకర మూలమలుపు వద్ద తరచు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు వాహనదారులను అప్రమత్తం చేయడానికి కోనరావుపేట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం సూచిక బోర్డులు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని చందుర్తి సర్కిల్ సిఐ కట్ల రవీందర్ తెలిపారు.గతంలో ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు, ప్రాణనష్ట ఘటనలు సంభవించినందున వాహనదారులు మూలమలుపు ప్రాంతంలో నెమ్మదిగా ప్రయాణిస్తు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సిఐ సూచించారు.ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని సి.ఐ తెలిపారు.ఈకార్యక్రమంలో కోనరావుపేట ఎస్ఐ కె ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య చికిత్స కోసం 1.50 లక్షల ఎల్ఓసి అందజేత

వాస్తవం : మద్దూరు

మండలంలో లద్నూరు గ్రామానికి చెందిన కర్రె సిద్దయ్య కుమారుడు ఐలయ్యకు నిమ్స్ హాస్పిటల్లో వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన 1 లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసీని యువ నాయకులు కొండ రాజు అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న ఐలయ్యకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం నుంచి ఎల్ఓసీ మంజూరు చేయించడంలో కొండ రాజు కృషి చేశారు.గతంలో కూడా ఐలయ్యకు 50 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసినట్లు తెలిపారు.పేద కుటుంబానికి అండగా నిలిచి వైద్య



ఖర్చుల కోసం సహకరించిన యువ నాయకుడు కొండ రాజుకు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వాస్తవం



# అగ్నిప్రమాద బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలి

## అధికారులకు వినతి



వాస్తవం : ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన రైతుల వరి పంటలు,వరి కుప్పలు,బోరు సామగ్రి అగ్నికి ఆహుతై తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రావ కట్ల సురేష్,ఎంపీడీవో శశికళ, వ్యవసాయ శాఖ ఏవో ప్రవీణ్‌లను కలిసి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అగ్నిప్రమాదంలో కైరి పరుశురాం వరి పంటతో పాటు బోరు మోటార్,విద్యుత్ వైర్లు దగ్ధమవగా,దారవేణి దేవయ్యకు చెందిన వరి కుప్ప గడ్డి,దారవేణి ఎల్లయ్యకు చెందిన రెండు వరి కుప్పలు కాలిపోయాయి. అలాగే దారవేణి శ్రీనుకు చెందిన బోరు చాటర్లు,వొల్లాల మల్లయ్యకు చెందిన బోరు పైపులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఆరు నెలల పాటు శ్రమించి పండించిన పంటలు క్షణాల్లో బూడిద కావడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గం టీబీజేఏసీ చైర్మన్‌గా కొల్లిపర నాగరాజు



వాస్తవం : జూబ్లీహిల్స్

తెలంగాణ బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీ ఆశయాలకు అనుగుణంగా, బస్తీల సమగ్ర అభివృద్ధికి కృషి చేసే ఉద్దేశంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కమిటీ ని పునర్వ్యవస్థీకరించడం జరిగిందని టీబీజేఏసీ చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నేపథ్యంలో, జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడ లో జరిగిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కమిటీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించుటకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయుటకు కొల్లిపర నాగరాజును టీబీజేఏసీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం చైర్మన్ గా నియమించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బి.ఆర్.ఎస్ ఇంచార్జ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో నాగరాజు కి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొల్లిపర నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పచెప్పిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని టీబీజేఏసీ ఆశయాలకు అనుగుణంగా బస్తీల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, చైర్మన్ గూసుల శ్రీనివాస్ యాదవ్ కి, మాగంటి సునీత కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సల్లా శ్రీనివాస్ యాదవ్, అమ్మాజీ, రవి కళ్యాణ్, అశోక, షబ్బీర్, , ప్రసాద్ చౌదరి, శ్రీనివాస్ రెడ్డి, నాగు, ఇస్మాయిల్ తో పాటు అధిక సంఖ్యలో బస్తీవాసులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటిక్ టీం తనిఖీలు



వాస్తవం : తిరుమలగిరి

జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శుక్రవారం నాడు తిరుమలగిరి మండల కేంద్రంలో గాంజా లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన, గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలోని హోటల్స్, షాపింగ్ మాల్స్, టీ దుకాణాలు, పాన్ డబ్బాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు తిరుమలగిరి ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యాలు మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రతీ పౌరుని పై ఉండాలని అన్నారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా,డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని సూచించారు.

# త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి



## పల్లిమక్త సర్పంచ్ జిన్నా అనూష-అనిల్

వాస్తవం : కోనరావుపేట

ప్రజలకు త్రాగునీటి సదుపాయ కల్పించడంపై ప్రత్యేక దృష్టి ఉందని కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామపంచాయతీ సర్పంచ్ జిన్నా అనూష- అనిల్ వెల్లడించారు. గ్రామంలోని రెండవ వార్డులో దాదాపు 150 మీటర్ ల మేరకు శుక్రవారం మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. కనీసం మౌలిక సదుపాయాలపై గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టిసారించిందని ప్రకటించారు. త్రాగునీటి సౌకర్యం కల్పించినందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులందరికి ప్రత్యేక కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు జాగిరి ఆనందం, జాగిరి కిరణ్, మొకెనపెల్లి బాలరాజు, జిన్నా సమత అర్జున్, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు నందగిరి భూమేష్ గౌడ్, ఎనగంటి ఆనందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు

## హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న



వాస్తవం : హుస్నాబాద్

సరస్వతీ మాత అంత్య పుష్కరాలకు హుస్నాబాద్ నుండి కా ళేశ్వరం కు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజే శారు. హుస్నాబాద్ బస్ స్టేషన్ నుండి కాళేశ్వరంలో జరుగుతున్న శ్రీ సరస్వతీ మాత అంత్యపుష్కరాలకు వయా కరీంనగర్ ద్వారా ప్రత్యేక బస్సులు నడపబడతాయని చెప్పారు. అయి తే వేసవి దృశ్య ప్రజల, ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం వేళల్లో బస్సు ప్రారంభం అవుతుంది కాబట్టి ప్రయాణికులు ముందే బస్సు స్టేషన్ కు చేరుకోవాలని అన్నారు. ఈ సదావ కాశాన్ని హుస్నాబాద్ పరిసర ప్రాంత మరియు నియోజకవర్గ ప్రయాణికులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

# పదిలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సన్మానం

## మెమొంటోలతో

## అభినందన విద్యతోనే సమాజాభివృద్ధి

## అధ్యక్షుడు బండారి నర్సయ్య



వాస్తవం : ఇల్లంతకుంట

అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 137 ఎ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మెమొంటోలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బండారి నర్సయ్య మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో మీరు కలలుగన్న చదువులు చదివి డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదిగి సమాజ మార్పుకు కృషి చేయాలని సూచించారు. మీ చదువు మరో పది మందికి సాయపడేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ మొదటి మెట్టులో రాణించిన మీరు అన్ని తరగతుల్లోనూ ఇదే విధంగా టాప్ ర్యాంకులు సాధించాలని కోరారు. ఇదే విధంగా ప్రతి సంవత్సరం ప్రతిభ కలిగిన విద్యార్థులను క్లబ్ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ జిల్లా చైర్మన్ డా. ఎలగందుల శ్రీనివాస్, జిల్లా పీఆర్వో పుల్లెల శ్యామ్, జిల్లా వైస్ గవర్నర్ విద్యాసాగర్, ఇల్లంతకుంట క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనబోయిన బాలరాజు, కోశాధికారి బొంగోని సత్యనారాయణ, పీఆర్వో రాజెల్లయ్య, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, మీడియా ఇన్‌చార్జి దయ్యాల సురేష్, సలహాదారులు మొగిల్ల బాబు, పర్శ ఐలయ్య, కీసరి కనుకయ్య, కోహెడ భాస్కర్, హెల్త్ క్యాంప్, బ్లడ్ డొనేషన్, ఐ డొనేషన్ ఇన్‌చార్జిలు రేగుల కార్తీక్, అంతటి తిరుపతి, దినేష్, కొమిరె శ్రీనివాస్, మహేష్, గడ్డం రవి, మ్యాకల ఐలయ్య, బండారి మాధవి, అంతటి సుజాత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భారత్ గ్యాస్ వినియోదారులకు పంపిణీ

వాస్తవం : మోత్కూర్
రోజున ఏజెన్సీ పరిధిలో 5 వాహనాములను భారత్ గ్యాస్ నియోగదారులకు పంపిణీ చేయుటకు డెలివరీ బాయ్స్ ను పంపగా కొండగడప డి రాపాక గ్రామాలకు వెళ్లిన ఇక్కిరి గిరి చంద్రయ్య రెండు ట్రిప్పులు 106 మంది భారత్ గ్యాస్ వినియోగదారులకు ఉదయం 9-30 గంటలనుండి సాయంత్రం 7-00 గంటల వరకు పంపిణీ చేయగా వడ దెబ్బ తగిలి అశ్వస్థత కు గురికాగా ప్రాథమిక చికిత్స చేయించన్ననది. ఒక్క రోజు మొత్తం 429 మంది వినియోగదారులకు పంపించేయడం జరిగినది.మరియు తేదీ 22-05-2026 ఈ రోజు తిరిగి గ్రామాలకు సిలిండరు వాహనం లను గ్రామాలకు పంపు సమయంలో డెలివరీ బాయ్స్ హమాలీలకు అందరికి సిలిండర్లు చేతులు కాలకుండా చేతి గ్లౌజు లు, టోపీలు, మజ్జిగ పాకెట్స్,మరియు వాటరు బాటిల్స్ పంపిణి చేసి వినియోగదారులకు పంపిణి చేయుటకు గ్రామాలకు పంపించనైనది. ఇట్టి కార్యక్రమంలో యాకు, ప్రభాకర్, వెంకన్న లు పాల్గొన్నారు వినియోగదారులందరు ముందస్తు షెడ్యూల్ ప్రకారం వినియోగదారులు అందుబాటులో ఉండి డెలివరీ బాయ్స్ కు సహకరించి వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఎండల తీవ్రతను పరిగణలోకి తీసుకొని సిలిండర్లు డెలివరీ చేసుకో గలరని కోరనైనది. ఇట్టి విషయంలు పెద్ద మనస్సుతో మీ ద్వారా బహుళ ప్రచారం చేయగలరని మనవి చిప్పలపల్లి యాదగిరి నాయబ్ తహసీల్దారు మోత్కూర్ఇంచార్జి.



# కిషోర బాలికలతో సమావేశం



వాస్తవం : ముప్కాల్
మండల కేంద్రంలో శుక్రవారం రోజు ఐకెపీ ఆధ్వర్యంలో కిషోర బాలికల సమావేశం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో భాగంగా ఐకెపీ ఏపీఎం శ్యామ్ మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు వారి వారి పిల్లలపై ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. పోషణ సైబర్, బాల్య వివాహాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్యామ్, సీసీ నవీన్, వీవోఏలు భాగ్యలక్ష్మి, లక్ష్మీ, కిషోర బాలికల సంఘం పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్‌లో సి ఐడి ఎస్ పి కార్యాలయాలు ఏర్పాటు చేయాలని పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్‌కి వినతి

### రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ డా వర్రే వెంకటేశ్వర్లుని సన్మానించిన జర్నలిస్టులు



వాస్తవం : మోత్కూర్
మోత్కూర్ లో సి ఐ సర్కిల్ ,డి ఎస్ పి కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర పోలీసు కంప్లైంట్ అథారిటీ మెంబర్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సమాచార కమిషనర్ డా వర్రే వెంకటేశ్వర్లు ని శుక్రవారం స్థానిక రహదారి బంగ్లా లో జర్నలిస్టుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు ని జర్నలిస్టులు శాలువతో సన్మానించారు.మోత్కూర్ పాత తాలుకా కేంద్రంలో పోలీస్ సర్కిల్,డివిజనల్ సూపరింటెండెంట్ కార్యాలయాలు లేకపోవడంతో మోత్కూర్,గుండాల, ఆత్మకూర్, అడ్డగుడూర్ మండలాల ప్రజలు 40 కి మీ దూరంలోని భువనగిరి, రామన్నపేట, ఆలేరు,చౌటుప్పల్ ప్రాంతాలకు వెళ్లాల్సివస్తుందని, దీంతో ప్రజలు రవాణా,ఆర్థిక పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ 4 మండలాల ప్రజల పరిపాలన సౌలభ్యం, సౌకర్యం కోసం మోత్కూర్ లోనే ఆయా కార్యాలయాలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్పందించిన అథారిటీ మెంబర్ వెంకటేశ్వర్లు అథారిటీ చైర్మన్, రాష్ట్ర హోమ్ మంత్రి, రాష్ట్ర డి జి పి ల దృష్టికి తీసుకెళ్లి ఆయా కార్యాలయాల మంజూరు కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎస్ ఎన్ చారి,కాయితాల నర్సిరెడ్డి, గుంటి అయిలయ్య,ఆకవరం శ్రీనివాస్ చారి,వారాల రాకేష్,గాదె నబోయిన నాగరాజు,బుర్ర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కొనసాగుతున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం



వాస్తవం : ముప్కాల్
ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతున్నట్లు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సాయిలు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. యువతి,యువకులు ఇట్టి వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సాయిలు, వార్డు సభ్యులు చిల్క దినేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు రాకేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

## తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ పదవికి
# ఆకునూరి మురళి రాజీనామా

**హైదరాబాద్, మే 22:** తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు.ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి.దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఏసీ రూమ్‌లలో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి దీటుగా మార్చాలనే పట్టుదలతో ఉండే ఆకునూరి మురళి.. గతంలో ఏపీ విద్యాశాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల చుట్టూ ముసిరిన రాజకీయ జగడం, ఉపాధ్యాయ లోకం నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత, అంతర్గత ఒత్తిళ్ల వల్లే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు సచివాలయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# విజిట్ టు ద మ్యూజియం బస్సు ప్రారంభం



జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

వాస్తవం: సిరిసిల్ల
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23 వరకు యువజన, క్రీడ, టూరిజం వారోత్సవాలు కొనసాగుతున్నాయి . ఇందులో భాగంగా విజిట్ టు ద మ్యూజియం ఎట్ కరీంనగర్‌లో బాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరలి వెళ్లే ఆర్ టీ సీ బస్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, జగన్ మోహన్ రెడ్డి, డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖా అధికారి ఎ రాందాస్, ప్రకటించారు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌమార దశలో బాలికలు ఆరోగ్య సమస్యపై జాగ్రత్త వహించాలి

## మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి చిట్టిబాబు



వాస్తవం : అందోల్

కౌమార దశలోనే బాలికలు ఆరోగ్య సమస్యలపై జాగ్రత్త వహించి ఆరోగ్యవంతమైన ఆహారం తినాలని అప్పుడే మీరు ఆరోగ్యంగా ఉంటారని మీరు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుంద ని సమాజం బాగుంటేనేదేశం బాగుంటుందని, అందోల్ జోగి పేట మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి చిట్టి బాబులు ఉద్ఘాటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య చరణలో భాగంగా కౌమార బాలికలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు జోగిపేట వేప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై ప్రసంగించారు. ఈ దశలోనే ఆరోగ్యానికాపాడుకోవాలని ఈ దశలోనే ఎదుగుదల బాగుంటుందని వారు విద్యార్థులకు సూచించారు. ఇందులో బాలికలకు హిమోగ్లోబిన్, షుగర్, హైట్, వెయిట్, టెస్టులు చేశారు. అలాగే ఆరోగ్యకరమైన సూచికలు చేసే ఆరు రకాలపుస్తకాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెంట్ డాక్టర్అశోక్, డాక్టర్ నితిన్, డాక్టర్ బాంధవి, డాక్టర్ దివ్య,వెప్మా టిఎంసి బిక్షపతి గౌడ్, వెప్మా ఆర్పీలు, ఆశా వర్కర్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు హాజరయ్యారు.

# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

## నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



వాస్తవం : సిరిసిల్ల

భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కిట్లు




వాస్తవం : ఇల్లంతకుంట

గీతా కార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ అన్నారు. ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్ పేట ఇల్లంతకుంట గీతా కార్మికులకు శుక్రవారం ఆయన కాటమయ్య రక్షణ కిట్లను అందజేసి మాట్లాడారు. గీతా కార్మికులకు ప్రమాదాల భారీ నుండి కాటమయ్య రక్షణ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. కాటమయ్య రక్షణ కి ఇట్లు ఏ విధంగా ఉపయోగించాలో గీతా కార్మికులకు శిక్షణ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. కాటమయ్య రక్షణ కిట్లు పొందిన గీతా కార్మికులు సద్వినియోగపరచుకొని ప్రమాదాల బారి నుండి కాపాడుకోవాలని సీఐ శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఎస్సై ప్రణీత్ గౌడ్, సంతోష్ ,కోమల, రమేష్ ప్రశాంత్, ఇల్లంతకుంట గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, రహీంఖాన్ పేట గౌడ సంఘం అధ్యక్షుడు చంద్ర య్య గౌడ ,సంఘ సభ్యులు వెంకటేశం, అంతటి శ్రీనివాస్, ముంజ భాస్కర్ గౌడ్, కొయ్యడ చందు గౌడ్, పరుశరామ్ గౌడ్ ,మల్లేశం గౌడ్, వెంకటేశం గౌడ్ పర్షరాం గౌడ్ శ్రీనివాస్ గౌడ్ ఎల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

JSS JOURNALISTS SANKSHEMA SANGAM

# జర్నలిస్టు సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్టుల హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# రైతు సేవ సహకార సంఘం



వాస్తవం : మోత్కూర్

మోత్కూర్లో నిర్వహిస్తున్న వరి ధా న్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు సందర్శించినారు మరియు సంఘ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,...ధా న్యము రవాణా గురించి మరియు రైస్ , మిల్లులల్లోన్యం దిగుమతి గురించి అధికారంతో మాట్లాడినామని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూసుకుంటామని వారు తెలియజేశారు వారితోపాటు సంఘ కార్యదర్శి కే వరలక్ష్మి మరియు రైతులు తదితరులు ఉన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునికి సన్మానం



వాస్తవం : చందుర్తి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గొట్టె ప్రభాకర్ ని చందుర్తి మండల శాఖ అధ్యక్షులుగా నియమించినందుకు శుక్రవారం ఈడుగు మహిపాల్, గొట్టె రవివర్మ లు శాలువాలతో సన్మానించారు. అన్నీ సామాజిక వర్గాల సమస్యలపై, ప్రజా సమస్యలు, అభివృద్ధి పై అనుభవంతో సానులంగా వ్యవహరించే ఇంజనీరింగ్ పట్టభద్రులు గొట్టె ప్రభాకర్ ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు సంతోషకరమని మహిపాల్, రవి వర్మ లు అన్నారు. అన్ని రాజకీయ పక్ష నాయకులతో సత్సంబంధాలు ఉన్న గొట్టె ప్రభాకర్ ని నియమించడం శుభపరిమాణమని అన్నారు.

# సుబ్బంపేటలో చిరుత పులి సంచారం



## భయాందోళనలో స్థానికులు

వాస్తవం : చర్ల

చర్లమండలంలోని సుబ్బంపేట పరిసర ప్రాంతాల్లో గ్రామాల్లో సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు పులి జాడలను గుర్తించి పట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే ..గత రెండు రోజులుగా చర్ల మండలంలోని సుబ్బంపేట, ఎదిరగుట్ట అటవీప్రాంతంలో రహదారిపై చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. రాత్రివేళల్లో సుబ్బంపేట ఇసుక ర్యాంప్ లో కూడా కనిపించినట్లు డ్రైవర్లు ఫారెస్ట్ అధికారులు సమాచారం అందించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. చిరుతపులి సంచారంపై ఫారెస్ట్ అధికారులు స్థానిక గ్రామాల ప్రజలను అలర్ట్ చేశారు. బావులు, పొలాలకు వెళ్లే వారు, పశువులను మేపేందుకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు.

వాస్తవం



# అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యం

**జిల్లాలో వేగంగా అభివృద్ధి పనులు**
**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**జిల్లాస్థాయి సభలో వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు**
**ఇందిరమ్మ చీరలు, కళ్యాణలక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ పంపిణీ, ఉపాధి హామీకి కంపూటర్ల అందజేత**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)** అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లాస్థాయి సభ జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవా ల్, ఎస్పీ మహేష్ బి గితే తదితరులు హాజరయ్యారు.ఇందిరా మహిళా శక్తి చీరలు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు బ్యాట రీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, ఎంపీడీఓలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. చేనేత జౌళి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, వ్యవసాయ, ఉద్యాన వన, మహిళా సంఘాలు, మత్స్య శాఖ తదితర శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వాటి సమాచారాన్ని సభకు వచ్చిన ప్రజలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.ఈ సందర్బంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.... సీ ఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటి వర కు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజే యడం, చైతన్యపర్చడం, భవిష్యత్ ప్రణాళికలు సిద్దం చేసే కా ర్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు ప్రజా పా లన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నదని తెలిపారు.రాష్ట్రంలో 27 నెలలుగా ప్రజా పాలన సాగుతున్నదని, అన్ని వర్గాల ప్రజలకు సహాయం అందుతుందని తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో కార్యక్రమాలు నిర్వహించామని, అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యులు చేసేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. మరో వెయ్యి ఏండ్ల పాటు ఆలయం ఉండేలా తీర్చిదిద్దుతున్నా మని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అం దుకున్నాయని, దేశానికి రోల్ మోడల్ ఈ పథకమని పేర్కొన్నారు. సొంత ఇంటి కల నిజం చేసేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు సొంత ఇల్లు కల నిజం చేయడంతో పాటు ఎందరికో ఉపాధి మార్గం దొ రుకుతుందని తెలిపారు. త్వరలో రెండో దశలో అర్హులకు ఇ స్తామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్ మంజూరు అయిందని, రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. నాణ్యమైన భోజనం, విద్య అందిస్తామని తెలిపారు.కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచా మని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఒకటి వస్తాయని, ఒక్కో స్కూల్ లో 1500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 36 వేల బెడ్స్ ఆసుపత్రుల్లో అందుబాటు లోకి రానున్నాయని తెలిపారు. లో వోల్టేజి పరిష్కారానికి సబ్ స్టేషన్లను ప్రారంభించామని, నూతన వాటి నిర్మాణానికి శంకు స్థాపన చేశామని పేర్కొన్నారు. రైతులు నిర్ణీత డబ్బులు చెల్లిస్తే రైతులకు విద్యుత్ కనెక్షన్, స్తంభాలు ఇస్తారని, అలాగే ఇందిరమ్మ ఇండ్ల వద్ద ఉన్న లూస్ వైర్లు, స్థంభాలు తొలగిస్తా రని తెలిపారు. జిల్లా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి మార్చి 6 న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మొత్తం 99 రోజుల కార్యా చరణ కింద 10 థీమ్ లతో 10 శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌లు పుల్కం రాజు, జిందం కళ, వైస్ చైర్మన్లు నరాల శేఖర్, జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు స్వరూప, రాజు, సబేరా బేగం, విజయ, ఆత్మ వేములవా డ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ నాగేంద్రచారి, సీపీఓ శ్రీనివాసాచా రి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## 2034 వరకు సీఎంవని నమ్మితే అసెంబ్లీని రద్దు చేసే దమ్ముందా?

**మేము రాజీనామా చేస్తం.. మీరూ చేయండి**
**రేవంత్ ముఖం చూసి ఓటర్లు ఓట్లేయలే**
**రేవంత్ సీఎం కావాలని ఎవరూ కోరుకోలే**
**పేమెంట్, మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కొన్నవ్**
**నువ్వు శక్తిమంతుడివైతే మహబూబ్‌నగర్ ఎంపీ సీటును ఎందుకు గెలిపించుకోలే?**
**నువ్వు ప్రజానాయకుడివైతే ఎంపీగా ఉన్నప్పుడు ఒక్క ఎమ్మెల్యేనైనా ఎందుకు గెలిపించుకోలే?**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం**

**హైదరాబాద్, మే 22 :** రేవంత్‌రెడ్డి ముఖం చూసి రాష్ట్ర ఓటర్లు ఎవరూ ఓట్లు వేయలేదని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎవరూ కోరుకోలేదని కేటీఆర్ స్పష్టంచేశారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేమెంట్, మేనేజ్‌మెంట్ కోటాలో రేవంత్‌రెడ్డి సీఎం సీటు కొనుక్కున్నారని విమర్శించారు. 'రేవంత్‌రెడ్డీ.. నువ్వు శక్తిమంతుడివి అనుకుంటే మహబూబ్‌నగర్ ఎంపీ సీటును ఎందుకు గెలిపించుకోలేదు? నువ్వు ప్రజానాయకుడివైతే ఎంపీగా ఉన్నప్పుడు ఒక్క ఎమ్మెల్యేనైనా ఎందుకు గెలిపించుకోలే?, ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ అయినా, కార్పొరేటర్‌ను అయినా ఎందుకు దక్కించుకోలేకపోయినవ్? అని నిలదీశారు. '2034 కాదు.. 2054 దాకా సీఎంగా ఉండు.. నీ పార్టీకి నువ్వు అడ్డగోలు పైసలు ఇస్తున్నవ్. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారింది. బీజేపీ నిన్ను పట్టుకోదు. దానికి మీకు మంచి ఫెవికాల్ బంధం నడుస్తున్నది. రేవంత్‌రెడ్డి అయినా, ఇంకొరైనా ఎవరైనా కలలు కనవచ్చు. కలలు కనండి.. కానీ, కథలు చెప్పకండి. పిట్టకథలు, లొట్టకథలు చెప్పే అధికారంలోకి వచ్చిండ్రు. పెట్రోల్ మీద కేసీఆర్ రూ.36 తీసుకుంటున్నారు అన్నారుగా? ఇప్పుడు తగ్గిస్తే ఎవరు వద్దంటున్నారు' అని ప్రశ్నించారు.నిజంగా రేవంత్‌రెడ్డికి 2034 వరకు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటాననే ధైర్యం ఉంటే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్దామా? అని కేటీఆర్ సవాల్ చేశారు. 'రాష్ట్రంలో అద్భుతమైన పాలన ఉన్నట్టు ప్రజలు అనుకుంటున్నారని మీరు భావిస్తే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్దాం.. ప్రజలు తీర్పు ఇస్తారు. మేము రాజీనామా చేస్తాం. మీరూ రాజీనామా చేయండి. బీజేపీవాళ్లు రాజీనామా చేయకపోయినా అసెంబ్లీ డిజాల్వ్ అయిపోద్ది. సీఎం రెడీగా ఉంటే మా పార్టీకి చెందిన 27 మంది సభ్యులం రాజీనామా చేస్తాం. మీ కాంగ్రెస్ సభ్యులతోపాటు మా పార్టీ నుంచి మీ పార్టీలో చేరినవారితో కూడా రాజీనామా చేయించు. ఎన్నికలకు పోదాం. అంతధైర్యం లేకపోతే, కనీసం మా పార్టీ నుంచి గుంజుకున్న తొమ్మిది మందితో అయినా రాజీనామా చేయించు ఎన్నికలకు వెళ్దాం. ప్రజానాయకుడివని భావిస్తే కనీసం ఈ పని అయినా చెయ్' అని సవాల్ విసిరారు.ఫ్యూచర్ లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడుతున్నాడని కేటీఆర్ విమర్శించారు. ఫార్మాసిటీ ఏర్పాటు కోసమనే నిబంధనలతో భూమిని సేకరించినట్టు గుర్తుచేశారు. నాచురల్ గ్యాస్ వాడుతామని, కర్బన ఉద్గారాలు, కాలుష్యానికి అవకాశం ఉండబోదని నిబంధన ప్రకారం 14,000 ఎకరాలకు కేంద్ర పర్యావరణశాఖ నుంచి అనుమతి తీసుకున్నట్టు తెలిపారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో ఇప్పుడు రేవంత్ సర్కార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదని విమర్శించారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమి అయినందున దాన్ని వేరే అవసరాలకు వాడటానికి వీలు లేదనే విషయాన్నే హరీశ్‌రావు చెప్పారని పేర్కొన్నారు.



# మహిళ తలపై మోది.... తీవ్రంగా గాయపరిచి

## బంగారం కోసమే హత్యాయత్నమా? దోపిడీ దొంగల నాటకమా? రాజవ్వను చంపడానికి ప్రయత్నించింది ఎవరు? అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

## కేసు కొలిక్కి రావడానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

వాస్తవం : హుస్నాబాద్

ఒక మహిళను రక్తం వచ్చేటట్టు మోది,హింసించి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించుకుపోయిన ఘటన హుస్నాబాద్ ప్రాంతంలో కలకలం రేపింది. గురువారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో టీవీ చూస్తూ గదిలో నిద్రలోకి జారుకున్న బోయిని రాజవ్వ ను తీవ్రంగా కొట్టి గాయపరచవలసిన అవసరం ఎవరికి ఉందని మంచి నీళ్ల బండ గ్రామంలో సందేహాలు మహిళల్లో మొదలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న ఏసీపీ సదానందం, సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ దర్యాప్తును ముమ్మరం చేశారు. శుక్రవారం క్లూస్ టీం ను రప్పించి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మరోపక్క డాగ్ స్క్వాడ్స్ తో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. కాగా సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసులో పురోగతి సాధించడానికి దర్యాప్తు వేగవంతంగా జరగడానికి ఆదేశాలు ఇచ్చారు. పూర్వాపరాల్లోకి వెళ్ళినట్లయితే...





హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలో గల మంచినీళ్ల బండ గ్రామంలో నివసిస్తున్న బోయిని కనక య్య (50) ముల్కనూరు గ్రామానికి చెందిన రాజవ్వ ను వివాహమాడాడు. కానీ సంతానం కలగలేదు. తరువాత మంచి నీళ్ల బండ గ్రామానికి చెందిన రాధ ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి దాంప త్యానికి గుర్తుగా ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. అప్పటినుం డి రాజవ్వ పిల్లలు లేని లోటును ఇద్దరు ఆడపిల్లలను చూసి ఆనందిస్తూ మురిసిపోయింది. రాధ పిల్లలనే తన పిల్లలుగా భావించి పెద్దమ్మ అనే పేరుకు సార్థకత చేకూర్చింది. మం చినీళ్ల బండ గ్రామంలో అందరికీ తలలో నాలుకలా మెదిలి మంచి పేరు తెచ్చుకొని కుటుంబాన్ని చూసుకుంటూ అంద రూ ఒకే ఇంట్లో జీవించసాగారు. పిల్లలు కూడా పెద్దవాళ్లై చదువుకోసాగారు. పెద్దమ్మాయి బీటెక్ ఫైన ల్ ఇయర్ చదు వుతుండగా, చిన్నమ్మాయి ఇంటర్మీడియట్ చదువుతున్నది. వేసవి కాలం కావడంతో అమ్మాయిలు ఇద్దరు పెద్దమ్మ( రాధ అయిన చెల్లి ఇంటికి) ఊరుకు వెళ్లారు. భర్త కనకయ్య హ మాలీ పనిచేస్తుంటాడు కాబట్టి ఐకెపి సెంటర్లో లారీలో వడ్ల బస్తాలు లోడ్ చేయాలని వెళ్ళాడు. ఇక ఇంట్లో ఉన్నది రాజ వ్వ మరియు రాధ మాత్రమే. గురువారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో రాజవ్వ టీవీ చూస్తూ నిద్ర లోకి జారుకు న్నట్లు అప్పుడే ఆమె నిద్రిస్తున్న గదిలోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తీవ్రంగా కొట్టినట్లు గదిలో లభించిన కర్రను, బాడిషను చూసి స్థానికులు చెప్తున్నారు. గదిలోకి ప్ర వేశించిన వారు తెలివిగా తమ ముఖాలు రాజవ్వకు కన బడకుండా ఉండడానికి గదిలో ఉన్న బల్బును తీసి పక్కకు పెట్టారని సమాచారం. వీటిని క్లూస్ టీం( ఫోరెన్సిక్) వారు సేకరించి బల్బు పై ఉన్న వేలిముద్రలు ఎవరివి అనే కోణం లో తెలు సుకునే ప్రయత్నంలో ఉన్నారు. రాధను పోలీసులు విచారించ గా నేను పక్కింటి వాళ్ళ దగ్గరికి వెళ్లి వచ్చేసరికి ఇలా జరిగిం ది అని చెప్పడం పోలీసులను విస్మయానికి గురి చేసింది. తలపై రక్తం, తీవ్ర గాయాలు, చెంపలపై కొట్టడంతో ఉబ్బిన ఆనవాళ్లు ఉండి తీవ్రంగా గాయపడ్డ రాజవ్వను గురు వారం రాత్రి హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి సిద్దిపేటకు మరింత మెరుగైన చికిత్స కోసం హై దరాబాదుకు తరలించగా శుక్రవారం తీవ్ర గాయాలతో కొట్టు మిట్టాడుతూ మృతి చెందింది. ఇక అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపడుతూ నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్తుండడం గమనార్హం.పనిచేయని సీసీ కెమెరాలు మంచి నీళ్ల బండ గ్రామంలో గతంలోనే 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ అవి ప్రస్తుతం పనిచేయడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసు శాఖ వారు పదే పదే చెబుతున్నారు. అయినప్పటికీ పెడచెవిన పెడుతూ ఉండడంతో ఇట్లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మొన్నటికి మొన్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో గాని షాపుల్లో గాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని జాగ్రత్తగా ఉండాలని సూచనలు ఇచ్చిన విషయం విధితమే. మరోపక్క హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి గ్రామాల్లో పర్యటిస్తూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు సైతం మూడో నేత్రంగా పనిచేస్తాయని చెప్తూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

## చేర్యాల మార్కెట్ యార్డులో నూతన షాపుల కేటాయింపునకు టెండర్లు

వాస్తవం : చేర్యాల

సిద్ధిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద రహదారి వెంట నూతనంగా నిర్మించిన 20 కమర్షియల్ షాపులు,7 రైతు బజార్ షాపుల దుకాణ సముదాయాలు అద్దెకు ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేతా తెలిపారు.ఆసక్తి గల వ్యాపారస్తులు కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు ఫారం రూ.2500/- చెల్లించి టెండర్ షెడ్యూల్ ఫారం పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.50,000/- ఈఎండిని సెక్రెటరీ,అగ్రి మార్కెట్ కమిటీ చేర్యాల పేరున డీడీ రూపంలో దరఖాస్తుతో జతపరిచి సమర్పించాలి.పూర్తి చేసిన దరఖాస్తులను మే 30లోగా కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.జూన్ 3న సంయుక్త సంచాలకులు, హైదరాబాద్ వారి తీర్పున్యంలో ఆన్లైన్ టెండర్ ఈ-వేలము ప్రక్రియ ద్వారా అత్యధిక బిడ్ వేసిన వారికి షాపులు కేటాయించబడతాయి.

జర్నలిస్టు సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ పదవికి
# ఆకునూరి మురళి రాజీనామా

**హైదరాబాద్, మే 22:** తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు.ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి.దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఏసీ రూమ్‌లలో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ప్రభుత్వ బదులను కార్పొరేట్ స్థాయికి దీటుగా మార్చాలనే పట్టుదలతో ఉండే ఆకునూరి మురళి.. గతంలో ఏపీ విద్యాశాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల చుట్టూ ముసిరిన రాజకీయ జగడం,




ఉపాధ్యాయ లోకం నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత, అంతర్గత ఒత్తిళ్ల వల్లే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు సచివాలయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి..

### క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ, గుజరాత్..!




భారీ విజయంతో క్వాలిఫయర్ 1 ఆడాలనుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలపై ఆర్సీబీ నీళ్లు చల్లింది.ఉప్పల్‌లో 256 పరుగుల ఛేదనలో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమివ్వగా.. కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. సన్‌రైజర్స్ బౌలర్లు గొప్పగా రాణించినా ఆర్సీబీని 165లోపు కట్టడి చేయలేకపోయారు. దాంతో.. హైదరాబాద్ మూడో స్థానానికే పరిమితమైంది.ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌కు బౌలర్లు భారీ స్కోర్ సమర్పించుకోగా.. ఆర్సీబీకి ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమిచ్చాడు. శివాంగ్ ఓవర్లో మూడు సిక్సర్లు, ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు పిండుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అయ్యర్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. సిక్సర్‌కు యత్నించిన అయ్యర్ మిడాన్‌లో అభిషేక్ చేతికి చిక్కాడు. కాసేపటికే షకీబ్ ఓవర్లో కవర్స్‌లో ఆడిన విరాట్ కోహ్లీ(15) స్మరణ్ చేతికి చిక్కాడు. దాంతో. పవర్ ప్లేలో ఆర్సీబీ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. కీలక వికెట్లు పడడంతో పడిక్కల్, పటిదార్ ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నారు. కానీ, పడిక్కల్‌ను ఔట్ చేసి రెండో వికెట్ సాధించాడు మలింగ. ఆ తర్వాత కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) .. సన్‌రైజర్స్ క్వాలిఫయర్ 1 అవకాశాల్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఆడాడు. పెద్ద షాట్లకు వెళ్లకుండావికెట్ కాపాడుకుంటూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. పార్ట్ టైమ్ బౌలర్ హెడ్ ఓవర్లో పాటిదార్ పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద చిక్కాడు. 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ జయభేరి మోగించింది.క్వాలిఫయర్ 1 పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసంతో కొండంత స్కోర్ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో అభిషేక్ శర్మ(56) మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఇషాన్ కిషన్(79), క్లాసెన్(51) జోడీ తర్ధ శతకాలతో ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యం నెలకొల్పగా.. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి(29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోగా హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

# విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



**వాస్తవం : శేర్లింగంపల్లి:** నడిగడ్డ తాండలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఏఈ వినతి పత్రం సమర్పించారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ తండాలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు చాలా వరకు శిథిలావస్థకు చేరి వంగిపోయి ఉన్నాయి. వర్షాకాలంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వాటి స్థానంలో వెంటనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కొన్ని విద్యుత్ స్తంభాలు నివాస గృహాల లోపల ఉన్నాయి. దీనివల్ల ఇంటి నిర్మాణాలకు, ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది . ఆ స్తంభాలను తొలగించి రోడ్డు పక్కన, లైన్‌లోకి మార్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఏఈ సానుకూలంగా స్పందించి పై సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గిరిజన సంక్షేమ సంఘం నడిగడ్డ తాండ అధ్యక్షులు సభవత్ హన్మ నాయక్, గౌరవ అధ్యక్షులు యం రెడ్యానాయక్,కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్, ఉపాధ్యక్షులు నాయిని రత్నకుమార్,సభ్యులు కాట్రావత్ శంకర్ నాయక్, అంగోత్ మోతీరామ్ నాయక్ పాల్గొన్నారు.